క్లుప్తంగా

9న రైతు సమస్యలపై ధర్నా

బేస్తవారిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సమస్యలపై ధర్నా కార్యక్రమం చేస్తున్నట్లు ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఢాకాల పుల్లయ్య తెలిపారు. ఆల్‌ఇండియా కిసాన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. 90 శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎటువంటి షరతులు లేకుండా ఇచ్చిన హామీ మేరకు విడుదల చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయాలని, బ్యాంకుల్లో ఇబ్బందులు పెట్టకుండా రుణాల మంజూరు, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముగ్గురు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

అర్ధవీడు: స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ముగ్గురు పదో తరగతి విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి గాను షైనింగ్ స్టార్స్ మెరిట్ ప్రతిభా పురస్కారాలు రాష్ట్ర విద్యాశాఖ నుంచి పొందినట్లుగా ప్రిన్సిపల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. పీ కోటేశ్వరావు 576 మార్కులు, కే నాగరాజు 555, దిలీప్ నాయక్ 527 మార్కులు సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులను, పాఠశాల సిబ్బందిని ప్రిన్సిపల్ అభినందించారు.

భక్తి పరవశం.. శ్రీవారికి పూజలు


వెలుగొండలో భక్తుల పూజలు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామ కృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. గ్రామానికి చెందిన జీ అంజనేయులుకు చెందిన పాడిగేదె పొలాల్లోకి మేత కోసం వెళ్లిన సమయంలో ప్రమాదానికి గురైంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌తీగను తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. రూ.70 వేల విలువైన పాడిగేదె మృతితో రైతు విలపిస్తున్నాడు. విద్యుత్‌శాఖ అధికారులు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నాడు.


బేస్తవారిపేటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కంభం ఈద్గా మైదానంలో బక్రీద్ ప్రార్థనల్లో ముస్లింలు


పొదిలి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినం

బేస్తవారిపేట: సహనం, త్యాగం, పరోపకారానికి నిదర్శనమైన బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. మండలంలోని కొత్తపేట, గలిజేరుగుళ్ల, చింతలపాలెం, బేస్తవారిపేట గ్రామాల్లోని ఈద్గాల వద్ద బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ, ముస్లింలు ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రాచర్లలో..

రాచర్ల: మండలంలోని అనుమలవీడు, రాచర్ల, పాలకవీడు, గుడిమెట్ట, యడవల్లి, ఆకవీడు, అరవీటికోట, అచ్చంపేట, సంగపేట, గౌతవరం, జేపీ చేరువు గ్రామాల్లో శనివారం ముస్లింలు ఈద్గాల వద్ద బక్రీద్ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. రాచర్లలోని మదరసాలో చదువుతున్న పెద పిల్లలకు ఆర్థిక సహాయం చేశారు.

కంభంలో..

కంభం: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నాగులవరం రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించగా పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కంభం ఈద్గా మైదానం వద్దకు వచ్చిన ప్రజలకు పట్టణంలో పలువురు యువకులు మజ్జిగ, మంచి నీళ్లు పంపిణీ చేశారు.

అర్థవీడులో..

అర్థవీడు: స్థానిక ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీపంలోని దర్గాలో శనివారం బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్ద పఠాను ఇలియాజు ఖాను పవిత్ర ఖురాన్ సందేశాన్ని వినిపించారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

కొమరోలు: మండలంలో ముస్లింలు బక్రీద్ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. కొమరోలు, పోసుపల్లె, మల్లారెడ్డిపల్లె, నల్లగుంట్ల, అల్లినగరం, రాజుపాలెం ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పోసుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈద్గా అభివృద్ధికి కందుకూరు ఎస్‌బీఐలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కలగొట్ల నాయబ్‌రసూల్ రూ.80 వేల నగదును ఈద్గా నిర్వాహకులకు అందచేశారు.


కొమరోలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గిద్దలూరులో..

గిద్దలూరు రూరల్: బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలోని ముస్లింలు ఈద్గాల వద్ద శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పట్టణంలోని నంద్యాల రోడ్డులోని ఈద్గా వద్ద పాల్గొని మాట్లాడారు. కొంగలవీడురోడ్డులోని ఈద్గావద్ద, అంబవరం, కె.ఎస్.పల్లె, ఉయ్యాలవాడ, కొమ్మునూరు, ముండ్లపాడు గ్రామాలల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పొదిలిలో..

పొదిలి రూరల్: పొదిలి బుగ్గచలం ట్యాంకు వెనుక వైపు ఈద్గాలో ముస్లింలు శనివారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు.

తర్లుపాడులో..

తర్లుపాడు: మండలంలో బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండగను పురస్కరించుకుని తుమ్మలచెరువు, తర్లుపాడులోని దర్గాల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. పవిత్ర ఖురాన్‌లో తెలిపిన విధంగా అల్లాహ్‌పై విశ్వాసంతో సన్మార్గంలో మానవులు జీవనం గడపాలని, తోటివారిపట్ల ప్రేమ, జాలి, దయ కలిగి ఉండాలని మత పెద్దలు బోధించారు. మంచికోసం, మానవ సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ త్యాగం చేయాలనే సందేశం వినిపించారు.


అనుమలవీడులోని ఈద్గా వద్ద దువా చేస్తున్న హాఫీజ్ అబ్దుల్ ఖాదర్


కంభం ఈద్గా మైదానం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న యువకులు

మార్కాపురంలో..

మార్కాపురం: అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య బక్రీద్ పండగను జరుపుకుంటారు. భక్తిశ్రద్ధలతో ముస్లింలు బక్రీద్ పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. తోటి వారి పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికీ సాయపడాలనే అల్లా బోధనలు ముస్లింలు గుర్తుచేసుకున్నారు. శనివారం ఉదయం నుంచి ముస్లింలు తగ్బీర్ చదువుతూ తమ తమ కుటుంబసభ్యులతో, బంధువులతో సమీపంలోని మసీదులకు, దర్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రత్యేక దువా ఏర్పాటుచేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఫ్తీ మహ్మద్ మిన్హాజ్ అల్లా సందేశం అందించి ప్రత్యేక ప్రార్థన చేశారు. ఖబరస్తాన్‌లలో దువాలు నిర్వహించి పేదలకు దానధర్మాలు చేశారు.


గిద్దలూరులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


పోసుపల్లెలో ఈద్గా నిర్వాహకులకు నగదు అందజేస్తున్న నాయబ్ రసూల్

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల కమిటీలను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

గిద్దలూరు నగర పంచాయతీ కమిటీ..

వైఎస్సార్‌సీపీ గిద్దలూరు నగర పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌లుగా పోలేపల్లి శివకుమార్, నంద్యాల బాలసుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రటరీలుగా నసరి శ్రీనివాసులు, కోటా సత్యనారాయణ, జనకి రంగనాయకులు, షేక్ నాయబ్ రసూల్, సెక్రటరీలుగా బారెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పర్ల వెంకటేశ్వరరెడ్డి, కాటసాని హనుమారెడ్డి, గోడి వెంకటేశ్వరరెడ్డి, శీలం నరసింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వేమా సుబ్బయ్య, మానం లక్ష్మీదేవి, వలశాని ప్రసాద్, దేవరాజుగట్టు రవికుమార్, ఆదిమూలపు రేణుక, పఠాన్ లతీఫ్‌ఖాన్, మారెబోయిన మౌనిక, దూదేకుల హుస్సేన్, చాగలమర్రి నాయబ్, యరమూరి భాస్కర్, అద్దంకి శ్రీనివాసులు, షేక్ జమల్ వలి, గుళ్ల ఓబులేసు, షేక్ అబ్దుల్ సుకూర్, మానం గంగాధర్‌రెడ్డి, ఎం కాశీనాయక్, మోరస రామాంజనేయులు, షేక్ బాషా, సూరేపల్లి రామకృష్ణ, యడవల్లి గురవయ్య, బెలగవి చంద్రకళ, గొంట్ల శంకర్, బ్రహ్మయ్య, పాలుగుళ్ల రాజేశ్వరి, పల్లె అశోక్‌రెడ్డిలను నియమించారు.

గిద్దలూరు మండలం:

వైస్ ప్రెసిడెంట్లుగా పేరమ్ హరినాథ్‌రెడ్డి, కర్రా శివకోటిరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఎడమ రామూర్తి నాయుడు, షేక్ నాయబ్ రసూల్, చందాల పెద బాబు, సెక్రటరీలుగా కొమ్మునూరి సుధాకర్, వందేటి లక్ష్మీరెడ్డి, షేక్ పేరావలి, తుంగా రంగస్వామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా గానుగపెంట రామయ్య, నంద్యాల నాగరాజురెడ్డి, వేముల రాజు, తాచిగొల్ల పిచ్చయ్య, బసిరెడ్డి ఒబులరెడ్డి, పందెన బోయిన రాజభూపాల్, బిల్ల శ్రీనివాసులు, షాబోలు కాశన్న, షోడా ఈశ్వర్‌రెడ్డి, వేమిరెడ్డి రామకృష్ణారెడ్డి, శీలం ఆదినారాయణ, కర్నాటి బాలఅంకిరెడ్డి, మల్లెబోయిన నాగేంద్రబాబు, జంగాల నాగార్జున, షేక్ షరీఫ్‌బాషా, బుడతా ప్రసాద్, చాగం భాస్కర్‌రెడ్డి, గంగారపు నాగిరెడ్డి, నాగం రాజశేఖర్, గుమ్మళ్ల భూతయ్య, ఉలావు కోటేశ్వర్లు, ఇస్లావత్ వెంకటేశ్వరనాయక్, బారెడ్డి చంద్రశేఖరరెడ్డి, దుమావత్ మంత్రి నాయక్, చిలకల రంగస్వామిరెడ్డి, శీలం పాట్టిరెడ్డి, పల్ల సుబ్బారెడ్డి, ఐ శ్రీనివాస నాయక్, రెడ్డి మాధవరెడ్డి, మెగావత్ కాశీనాయక్, మోడి కాశీరావు, పఠాన్ మహబూబ్‌ఖాన్, కాత్రవత్ శివనాయక్, వేమిరెడ్డి సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్ చిన్న గురవయ్య, కోటపురెడ్డి రమణారెడ్డి, సమడి నడిపి సుబ్బయ్య, పాణ్యం సుబ్బారెడ్డి, తుంగా రంగస్వామిరెడ్డి, కే ఖాదర్‌రెడ్డి, కొత్తకోట గంగయ్య, శీలం చిన్నపురెడ్డి, గుట్టపాటి చిన్నహుస్సేనయ్య, గోడుగుంటి చిన్న గుర్రప్పలు నియమితులయ్యారు.

రాచర్ల మండలం:

వైఎస్సార్‌సీపీ రాచర్ల మండల వైస్ ప్రెసిడెంట్లుగా బెల్లం నాగిరెడ్డి, పాలుగుళ్ల శివారెడ్డి, దూదేకుల కాశయ్య, జనరల్ సెక్రటరీలుగా కుప్పల రవి, జీ పుల్లారెడ్డి, ఎస్ రామకృష్ణారెడ్డి, సెక్రటరీలుగా కే నెమిలయ్య, వై భాస్కర్‌రెడ్డి, షేక్ నజీర్‌బాషా, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా గువ్వా రామకృష్ణ, చిట్టెం దామోదర్, ముత్యాల సుబ్బారావు, వేల్పుల గోవింద్‌రాజ్, దుడిపల్లి నరసింహ, మార్తాల రామయ్య, బైరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండ్లా వెంకటస్వామి, డాక్టర్ పుల్లారెడ్డి, గుర్రం బాలయ్య, పిడతల సుబ్బారెడ్డి, ఈ గోపాల్‌యాదవ్, ఎం ప్రభాకర్‌రెడ్డి, ఎం శ్రీరంగారెడ్డి, ఎస్ నాగేశ్వరరావు, షేక్ రసూల్, కతారు రంగస్వామి, మదిర రామసుబ్బారెడ్డి, పీ శ్రీరాములు, పందిటి నాగయ్య, వై రవికుమార్, బీ శకుంతల, బీ కోటిరెడ్డిలను నియమించారు.

అర్థవీడు మండలం:

వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్లుగా షేక్ ఖాదర్‌బాషా, కారె శ్రీను, జనరల్ సెక్రటరీలుగా చేగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వల్లపురెడ్డి వెంకట రమణ, సాకం సుబ్బారెడ్డి, మద్దెర్ల పెద్దిరాజు, కాగిత రాజయ్య, యేనుముల శ్రీనివాసులు, బోగెం చిన్న లింగయ్య, సెక్రటరీలుగా దొండపాటి శివ, శిరివెళ్ల సురేష్, చేగిరెడ్డి పోతిరెడ్డి, మూరక బ్రహ్మానందరెడ్డి, షేక్ బాంబేవలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా తుంబేటి బాలకృష్ణ, పరిమల సల్మాన్, గుమ్మళ్ల తిరుపతి, మాదాసు చిన్నశేషయ్య, దామిరెడ్డి పుల్లారెడ్డి, గిలిగిత్తల రాజారావు, గోపిదేశి బాలకృష్ణ, దూదేకుల సిద్దయ్య, కలగట్ల శ్రీనివాసరెడ్డి, చేగిరెడ్డి పోతిరెడ్డి, నందిరెడ్డి తిరుపతిరెడ్డి, వల్లెల వీరారెడ్డి, కొల్లెబోయిన వెంకటేశ్వర్లు, దేశావత్ రంగనాయకులు, కొంకల చిన్న లక్ష్మయ్య, కాకునాటి భాస్కర్‌రెడ్డి, పట్లావత్ పెద్దకాశి నాయక్, పఠాన్ ఖాదర్‌ఖాన్, కువ్వారపు చిన్న నాగరాజు నియమితులయ్యారు.

మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు


బేస్తవారిపేట: ఎస్జీటీలకు మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్.లక్ష్మీరెడ్డి అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద శనివారం యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ విద్యాశాఖ అధికారులు ఇచ్చిన హామీకి భిన్నంగా బదిలీల కౌన్సిలింగ్‌లో వెబ్‌కౌన్సిలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం అభ్యంతరకరమన్నారు. ఆదివారం ఒంగోలులో జరిగే డీఈఓ కార్యాలయం ముట్టడికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల నాయకులు పీవీ రాజశేఖర్, డీ ఖాశీంవలి, జీ శ్రీనివాసరావు, ఇండేలా రాజశేఖరరెడ్డి, ఎన్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


కల్యాణ ఘట్టాన్ని జరిపిస్తున్న వేదపండితులు

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి వైభవంగా నిర్వహిరచిన శ్రీపట్టాభిరామచంద్రస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రాణ ప్రతిష్ట మహోత్సవాలు శనివారంతో వైభవంగా ముగిశాయి. వేద మంత్రాలు, మేళతాళాలు, భక్తుల కోలాహలం, జైశ్రీరామ్, జైశ్రీరామ్ జయజయ ధ్వానాలతో రామాలయం వద్ద సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ వేదపండితులు శేఖరశర్మ పర్యవేక్షణలో తిరుపతి ఆగమ పండితులు శిష్య బృందం ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణం ఉభయదాతలుగా పలువురు గ్రామస్తులు పాల్గొని పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామివారికి ముత్యాల తలంబ్రాలతో కల్యాణం జరిపించారు. ఉత్సవాల సందర్భంగా అన్నదానం, కోలాటం ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రంగనాయకులు

కంభం: శ్రీకృష్ణదేవరాయ బలిజసేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఉదయగిరి బృందావనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించగా 50 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారిని నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ కు తీసుకెళ్లారు. గుండె, ఎముకలు, క్యాన్సర్ వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఈసీజీ, ఇతర టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బీపీ రంగనాయకులు, అర్ధవీడు ఎంపీపీ వెంకట్రావు, డాక్టర్ మోహన కృష్ణ, డాక్టర్ మృధులా నాయుడు, రమణ, ఉదయగిరి మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

రంగస్వామి దర్శనం పరమ పవిత్రం


ప్రత్యేక అలంకరణలో నెమలి గుండ్ల రంగనాయకస్వామి

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. లక్ష్మమ్మవనం నుంచి భక్తులు ముడుపులతో పాదయాత్రగా వెళ్లి నీటిగుండంలో స్నానాలు ఆచరించి స్వామివారికి ముడుపులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తొలుత నెమలిగుండ్ల రంగనాయకస్వామి వారికి దేవస్థానం అర్చకులు అన్నవరం పాండురంగాచార్యులు, అన్నవరం సత్యనారాయణచార్యులు ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలతో పాటు ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ మల్లవరపు నాగయ్య పాల్గొన్నారు.

అంకాలమ్మా.. దీవించమ్మా!


వైఎస్సార్ సీపీ ప్రభ

కొనకనమిట్ల: అమ్మా..అంకాలమ్మా దీవించమ్మా అంటూ మండల కేంద్రం కొనకనమిట్లలో పురాతన ఆలయం అంకాలేశ్వరి ఆలయంలో శనివారం గ్రామస్తులు అమ్మవారి జాతర నిర్వహించారు. అంకాలమ్మ తల్లి జాతరను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించి పునీతులయ్యారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. ముందుగా అమ్మవారి కళశాన్ని ఉత్సవం నిర్వహించి ఆలయంలోకి తీసుకొచ్చారు. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా పోటాపోటీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒకటి, టీడీపీ తరఫున ఒక విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభపై ఏర్పాటు చేసిన పాలకచ్చేరి ఆహుతులను అలరించింది. ఆదివారం అమ్మవారికి కుంకుమ బండ్లు, గ్రామోత్సవం నిర్వహిస్తారు.

కంభం విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

కంభం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న జిల్లా స్థాయి షైనింగ్ స్టార్ అవార్డులకు ఎన్నికయ్యారు. హెచ్ఈసీ గ్రూపులో తమ్మినేని చాతుర్య (980/1000), బడిపాటి సతీష్ (929/1000) మార్కులు సాధించి ప్రతిభ కనబరచడంతో ఈ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు. ఈనెల 9వ తేదీన ఒంగోలులో పెళ్లూరు సాయిబాబా సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రాచర్ల విద్యార్థులకు కూడా..

రాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరుతో అవార్డులు అందిస్తోందని ఎంఈవో వారణాసి గిరిధరశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బచ్చిగారి లక్ష్మీప్రియ 593/600, స్పందన స్కూల్‌కు చెందిన జి.వెంకట లయ 586/600, కే.ధరణి 578/600, షేక్.మహమ్మద్ ఆరీఫ్ 578/600, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కే.ప్రియదర్శిణి 558/600, ఒద్దులవాగుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన శివాజీ నాయక్ 518/600 మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డులను దక్కించుకున్నారని తెలిపారు. అత్యంత మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.20 వేల నగదుతో పాటు, మెడల్, ప్రశంసప్రతాన్ని ఈ నెల 9వ తేదీ కలెక్టర్ చేతులు మీదుగా అందజేస్తున్నట్లు తెలిపారు.

వేడుకగా బ్రహ్మంగారి స్వామికి పూజలు

కొనకనమిట్ల: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ముగిసి నెలైన సందర్భంగా మండలంలోని గనివానిపాడులో బ్రహ్మంగారి స్వామి ఆలయంలో శనివారం గ్రామస్తులు పూజలు చేశారు. మేళతాళాలతో గ్రామస్తులు ఆలయం వద్దకు నైవేద్యాలతో వచ్చి మొక్కులు చెల్లించారు. సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. నెల పొంగళ్లు సందర్భంగా ఏర్పాటు చేసిన బ్రహ్మంగారి నాటకం భక్తులను ఆకట్టుకుంది. చినమనగుండంలో నూతనంగా ప్రతిష్ఠించిన బ్రహ్మంగారి ఆలయం వద్ద గ్రామస్తులు పూజలు చేశారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవుని కళ్యాణం


ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలఓక్ష్మ చెన్నకేశవ స్వామి శాంతి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్త్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయం మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు హాజరయ్యారు. స్వామి వారి కళ్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పొలం తగాదాలో ఇరువర్గాలపై కేసు నమోదు

గిద్దలూరు రూరల్: మండలంలోని రాజుపేట గ్రామంలో పొలం తగాదా విషయంలో ఇరు వర్గాల పై శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన పోతుగంటి వెంకటేశ్వర్లు, పోతుగంటి వీరయ్యల మధ్య పొలం తగాదా విషయంలో ఘర్షణపడి ఒకరి పై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం వారు చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల పై పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు